క్లుప్తంగా

కల్వర్టు నిర్మించాలి



నాగిరెడ్డిపల్లి-కొత్తూరు మార్గంలో బీటీరోడ్డు దుస్థితి

బొంరాస్‌పేట: నాగిరెడ్డిపల్లి-వడిచర్ల బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. చాలాకాలంగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూర్తిగా బీటీ రూపం కోల్పోయి, మట్టి రోడ్డుగా మారింది. అసలే వర్షాకాలం.. ఆపై మట్టిరోడ్డు కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మించి, శాశ్వత పరిష్కారం చూపాలని మహంతీపూర్, వడిచర్ల, కొత్తూరు తదితర తండాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు పలకల పంపిణీ



విద్యార్థులకు పలకలు పంపిణీ చేస్తున్న అనిల్‌కుమార్

దోమ: విద్యార్థులు ఇష్టంతో చదవాలని హరివిల్లు ఫౌండేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనిల్ కుమార్ సూచించారు. శుక్రవారం దోమ మండలం మెట్టుగడ్డతండాలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను వింటూ ఉన్నతమైన ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ అభ్యర్థికి సన్మానం



అశోక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దేముల్: విధి నిర్వహణలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన కుర్వ అశోక్ ఎస్‌ఐ ఉద్యోగానికి అర్హత సాధించిన సందర్భంగా మంబాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయ బృందం గ్రామ నాయకులు, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ తదితరులు అశోక్, ఆయన తల్లితండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎస్‌ఐ ఉద్యోగం సాధించడం హర్షణీయమన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

పెద్దేముల్: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలంగిర్మాపూర్ పోలింగ్ స్టేషన్‌ను మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) రాజిరెడ్డితో కలిసి ఆయన తనిఖీ చేశారు. గ్రామానికి ఎంత దూరంలో ఉంది, దాని వలన ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దశలవారీగా గ్రామాభివృద్ధి

మొయినాబాద్: దశలవారీగా గ్రామంలోని అభివృద్ధి పనులు చేపడుతున్నామని సురంగల్ సర్పంచ్ గడ్డం లావణ్య అన్నారు. మండలంలోని సురంగల్‌లో గ్రామ పంచాయతీ నిధులు రూ.9 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రామంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మిగిలిపోయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, ఇతర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాదమ్మ, వార్డు సభ్యులు సుప్రియ, భాస్కర్, షఫీ, విక్రంరెడ్డి, కార్యదర్శి సుహాసిని, మాజీ ఉపసర్పంచ్ అంజిరెడ్డి పాల్గొన్నారు.



గోధుమగూడ గ్రామానికి చెందిన ఎస్‌ఐ అభ్యర్థి ఏనుగు రాఘవేందర్ రెడ్డిని వికారాబాద్‌లోని తన నివాసంలో సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్. చిత్రంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.
- అనంతగిరి

పత్తాలేని పెసర పంట!



రోడ్డుపై ఆరబోస్తున్న పెసర్లు

- పప్పుదినుసులు మహాప్రియం
- కనుమరుగవుతున్న పెసర, మినుము

బొంరాస్‌పేట: టమాట ధర వింటే నోటమాట రావడంలేదు. దానికి కారణం? సాగు తక్కువ కావటం !. దీంతో దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం. ఫలితంగా ధరలు ఆకాశాన్నంటడం ఇప్పుడు మనం చూస్తున్నదే. మునుముందు పప్పుదినుసుల ధరలు సైతం టమాట రూట్లో పయనించనున్నట్లు ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. కారణం ఈ పంటలు తగ్గిపోవటమే. ఇది వరకు మెట్టపొలాల్లో విచ్చలవిడిగా పండే పప్పుదినుసుల పంటలు.. ఇప్పుడు కనుచూపుమేర కనిపించడం లేదు. దీంతో అవి మహాప్రియంగా మారాయి. వర్షాకాలంలో విస్తారంగా పండే పెసర పంట పత్తాలేకుండా పోయింది.

కనుమరుగు

రేగడి, చెలక పొలాల్లో వర్షాకాలంలో పప్పుదినుసులు పెసరా, మినుము, కంది పంటల సాగు తగ్గుముఖం పట్టాయి. ఆహార పంటలకు బదులు వ్యాపార పంటలపై రైతులు మొగ్గుచూపుతున్నారు. పెట్టుబడి అంతగా లేని పెసరపంటను సాగుచేయకపోవడం విచారకరం. ఇదివరకు ముసురువానలతో పెసర ఏపుగా పెరిగి, నిలువునా పాడయ్యేది. రైతుకు నష్టం కలిగించేంది. గతేడాది అదే జరిగింది. కాగా ఈ సారి పెసర, మినుము పంటల సాగుకు వానాకాలం కలిసొచ్చేదని, మొన్నటి ఎడతెరిపి లేని వర్షాలకు చేతికొచ్చిన పెసర.. తడిసి మొలకెత్తి నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

అవగాహన అవసరం



వాతావరణం, వానాకాలం పరిస్థితులను బట్టి వ్యవసాయ అధికారులు అధిక దిగుబడినిచ్చే పంటల గురించి రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించాలి. మండలంలో ఈ సారి పెసర, మినుము వంటి పప్పు దినుసుల పంటలు బాగా తగ్గాయి. ఫలితంగా ప్రజలపై ధరల ప్రభావం పడొచ్చు.
– భీరెండ్డి, రైతు, కొత్తూరు



పెసర పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

గుర్తించకపోతే నిరవధిక సమ్మె



అనంతగిరి: ఎమ్మెల్యే ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

- సెకండ్ ఏఎన్‌ఎంలు
- ఎమ్మెల్యేలకు వినతిపత్రాల అందజేత

పరిగి: కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, పనిభారం తగ్గించాలని, సుప్రీం కోర్టు చెప్పిన విధంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేసి, పింఛన్, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని ఏఎన్‌ఎంలు హెచ్చరించారు.

క్రమబద్ధీకరించాలి

అనంతగిరి: చాలీచాలనీ వేతనాలతో ఎంతో కాలంగా ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించడం లేదని సెకెండ్ ఏఎన్‌ఎంలు ఆరోపించారు. సమస్యలు పరిష్కరించడంతో పాటు, క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఏఎన్‌ఎంలు చెప్పారు.



పరిగి: ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

మన సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం

బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: విద్యార్థులు దేశ సేవకు జీవితాన్ని అంకితం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ పిలుపునిచ్చారు. నాదేశం, నా మట్టి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆ పార్టీ నాయకులు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్ర, శనివారాల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. 13న గ్రామాల్లో మొక్కలు నాటడం, 13,14,15 తేదీల్లో ప్రజలు ప్రతి ఇంటిపై, కార్యాలయంపై, పలు కూడళ్లలో జాతీయ జెండాను ఎగురవేయాలని పేర్కొన్నారు. 16 నుంచి 26 వరకు దేశ నలుమూలల నుంచి మట్టి సేకరణ ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, పట్టణ కార్యదర్శి చందు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు వచ్చాయ్

మోమిన్‌పేట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు అవసరమైన కిట్లు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చాయి. వాలీబాల్, క్రికెట్, వ్యాయామ పరికరాలతో పాటు, ఒక్కో జీపీకి 75టీ షర్టులు రానున్నాయి. త్వరలో గ్రామ పంచాయతీకి పరికరాలను పంపిణీ చేయనున్నట్లు మండల అధికారులు పేర్కొన్నారు.

కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలు

బంట్వారం: కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలని కాంగ్రెస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మల్‌శెట్టిపల్లి తండాలో గ్రామ కమిటీ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాయ మాటలతో మరోసారి మోసం చేసేందుకు కేసీఆర్ సిద్ధమవుతున్నారని, ఈ సారి అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు రాము నాయక్, రమేశ్ నాయక్, అక్బర్, మహేశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎంపిక

తాండూరురూరల్: గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను పారదర్శకంగా ఎంపిక చేయాలని ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో అప్లికేషన్లను పరిశీలించి, ఓపెన్‌ప్లాట్ ఉన్న వారిని అర్హులుగా పేర్కొనాలని కార్యదర్శులకు సూచించారు.

భారీ వాహనాలను జాగ్రత్తగా నడపాలి

యాలాల: భారీ వాహనాలను డ్రైవర్లు జాగ్రత్తగా నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటుపడాలని ఎస్‌ఐ అరవింద్‌కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాండూరు నుంచి నిత్యం కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు నాపరాతి, సిమెంటు లోడ్లతో భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని, ఆ డ్రైవర్లు, క్లీనర్లు అప్రమత్తంగా ఉంటూ.. జాగ్రత్తగా నడిపి గమ్యం చేరుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. అనంతరం వాహన పత్రాలు, లైసెన్సులను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

హామీలను మరిచిన ప్రభుత్వం

- రానున్నన్న ఎన్నికల్లో అధికారం కాంగ్రెస్‌దే
- యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సంతోష్ గౌడ్

బంట్వారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు సంతోష్ గౌడ్ పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో చేపట్టిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గెలుపే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పని చేయాలని, ఇంటింటికీ వెళ్లి వరంగల్ రైతు డిక్లరేషను ప్రజలకు వివరించాలని చెప్పారు. ఎన్నికల హామీలను మరచిన బీఆర్‌ఎస్.. ఓట్లు అడిగే నైతిక హక్కును కోల్పోయిందని, మత రాజకీయాలు చేసే బీజేపీని ప్రజలు తరమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్సే అధికారం చేపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, ఎంపీపీ ప్రభాకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు అజీమ్, గౌస్, నాయకులు మున్నాబాయ్, నర్సింహులు, సుదర్శన్, సంజీవ్, వెంకటేశం, శంకర్, రమేశ్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్‌గౌడ్

మట్టిరోడ్డు కాదు.. బీటీనే



మట్టిరోడ్డును తలపిస్తున్న బీటీ

ధారూరు: ఇది మట్టిరోడ్డు అని అనుకుంటున్నారా? కాదు ఇది బీటీరోడ్డే.. మొన్నటి వర్షాలకు పూర్తిగా బీటీ కొట్టుకుపోయి ఇలా బురదమయంగా మారింది. ధారూరు మండలం రుద్రారం–నాగసమందర్ గ్రామాల మధ్య కోట్‌పల్లి ప్రాజెక్టు సమీప రోడ్డు దుస్థితి ఇది. దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు పనులు చేపట్టాల్సిన గ్యాంగ్‌మెన్లు ఇతర పనుల్లో పాల్గొనడం, నిర్వహణ బాధ్యతలు తీసుకున్న కాంట్రాక్టర్లు అటువైపు చూడకపోవడంతో రహదారుల దుస్థితి ఇలా తయారయిందని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు సైతం రోడ్ల పరిస్థితిని ఎరగకపోవడం విడ్డూరంగా ఉందని, ఇప్పటికైనా ప్రజారవాణాను దృష్టిలో పెట్టుకొని ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ సర్కారు సంకల్పానికి నిదర్శనం



బాణసంచాలు కాలుస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

'ఎత్తిపోతల' పర్యావరణానికి గ్రీన్‌సిగ్నల్‌తో బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు

దోమ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల మంజూరుకు ఈఏసీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నేతలతో కలిసి బాణసంచాలు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం మాట్లాడారు. కృష్ణమ్మ నీళ్లను తెచ్చి పాలమూరు బిడ్డల పాదాలు కడిగే రోజులు దగ్గరల్లో ఉన్నాయని, పర్యావరణ అనుమతులకు సీఎం కేసీఆర్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఇది తెలంగాణ సర్కారు సంకల్పానికి నిదర్శమని చెప్పారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాజపాష, వార్డు సభ్యులు మైనొద్దీన్, రైతులు శ్రీనివాస్ రెడ్డి, మునీర్, కమ్మర్, ఈడిగి గోపాల్, గానుగ నర్సయ్య, నర్సింహారెడ్డి, శ్రీశైలం, రాములు తదితరులు పాల్గొన్నారు.

తపాలాశాఖలో జాతీయ జెండాల విక్రయం



జాతీయజెండాలను ప్రదర్శిస్తున్న అధికారులు

కుల్కచర్ల: తపాలశాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల ఎంపీడీఓ నాగవేణి చెప్పారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పోస్ట్‌మెన్ సురేష్ ఆధ్వర్యంలో జాతీయజెండాలను ప్రదర్శించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాలను ఎగురవేస్తున్న నేపథ్యంలో తపాల కార్యాలయం (పోస్టాఫీస్)లో జాతీయ జెండాలు తక్కువ ధరలో రూ.25కే విక్రయిస్తున్నారని చెప్పారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, టైపిస్ట్ జగదీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఉదారత

కుల్కచర్ల: మండల పరిధి అడవివెంకటాపూర్ గ్రామానికి చెందిన నేనావత్ విఠల్ నాయక్.. మహారాష్ట్రలో మేస్త్రీ పని చేసేవాడు. బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. కంజుర్గ్‌మార్గ్ ప్రాంతంలో ప్రముఖ కాంట్రాక్టర్ (బిల్డర్) రవి మాత్రే వద్ద విఠల్ పని చేసేవాడు. ఈ క్రమంలో సదరు నిర్మాణదారుడు శుక్రవారం బాధిత కుటుంబీకుల ఇంటికి వచ్చి, తక్షణ ఆర్థిక సహాయంగా రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జయరాజు నాయక్, శివరాం నాయక్, హరిలాల్, రాజు, శంకర్, తుల్జ్యా, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి

పెద్దేముల్: తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ తలారి వీరప్ప అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో రూ.5లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామానికి ఎమ్మెల్యే రూ.50లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేశారని, ఈ నెల చివరి వరకు వాటితో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటయ్య, గ్రామ పెద్దలు మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సూచన మేరకే మాత్రలు వాడాలి



సిరిపురంలో రోగులతో మాట్లాడుతున్న సల్వన్‌కుమార్

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ సల్వన్‌కుమార్

మర్పల్లి: బీపీ, షుగర్ బారినపడిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వైద్యుల సూచనల మేరకే మాత్రలను వాడాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ సల్వన్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని సిరిపురంలో పట్లూర్ పీహెచ్‌సీ సిబ్బంది రోగులకు పంపిణీ చేసిన బీపీ, షుగర్ మాత్రలు రోగులు ఏ విధంగా వాడుతున్నారనే వివరాలను శుక్రవారం ఆ గ్రామంలో పర్యటించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వారు వాడుతున్న మందుబిల్లలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగయ్యను ఆదేశించారు. పట్లూర్ పీహెచ్‌సీ డాక్టర్ నేహ, సీహెచ్‌ఓ వజ్రమ్మ, హెచ్‌ఈఓ తిరుపతయ్య, పీహెచ్‌ఎన్ పుష్పలత, ఏఎన్‌ఎంలు మతుల్లమ్మ, స్వాతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

షుగర్, బీపీలకు ఒకే ట్యాబ్లెట్..

మోమిన్‌పేట: షుగర్, బీపీ పేషంట్లకు ఒకే ట్యాబ్లెట్ ఇవ్వనున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ సల్వన్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెల్‌జాల్, మర్పల్లి మండలం సిరిపురం గ్రామాలను ఆయన సందర్శించారు. గతంలో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో షుగర్ పేషంట్లకు ఒక ట్యాబ్లెట్, బీపీ పేషంట్లకు ఒక ట్యాబ్లెట్ ఇచ్చేదన్నారు. అయితే ప్రస్తుతం బీపీ, షుగర్ రెండూ ఉన్న రోగులకు ఒకే ట్యాబ్లెట్ ఇస్తున్నామని తెలిపారు. ఒక ట్యాబ్లెట్ ఈ రెండు రోగాలకు పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో షుగర్, బీపీ రోగులతో మాట్లాడి వారి ఫీడ్‌బ్యాక్‌ను స్వీకరించారు. సర్పంచ్ మల్లయ్య, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

ఉచిత ఎరువు ఉత్తమాటేనా?



మహిళలతో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

- దళితులను మోసం చేసిన కేసీఆర్
- ముఖ్యమంత్రి జిమ్మిక్కులు నమ్మొద్దు
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: రైతులకు ఉచితంగా ఎరువులను పంపిణీ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మోమిన్‌పేట మండలం కేసారంలో ఇంటింటికీ తిరిగి పార్టీ వరంగల్ డిక్లరేషన్‌ను ఆయన వివరించారు. అనంతరం మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా దళితున్ని చేస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి, మోసం చేశారని మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా సొంత స్థలం ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకోవటానికి రూ.5లక్షలు ఇస్తానని చెప్పి.. ఇప్పుడు రూ.3 లక్షలకు వచ్చారని దుయ్యబట్టారు.

వీధికో బెల్టు షాపు

ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు జిమ్మిక్కులు చేస్తున్నారని, మరో మారు తెలంగాణ ప్రజలు మోసపోవద్దని మాజీ మంత్రి చెప్పారు. వీధికో బెల్టు షాపులను పెట్టి, తాగు బోతులను తయారు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పేదలకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూములను తిరిగి తీసుకొని అమ్ముకుంటుందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను అమ్ముకునే హక్కులను కల్పిస్తామని, ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

రూ.4వేల పింఛన్

57 సంవత్సరాలు పూర్తి చేసుకొని, ఒకే ఇంట్లో ఇద్దరు అర్హులు ఉన్నా రూ.4వేల పింఛన్ ఇస్తామని ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, సంవత్సరానికి ఆరు ఉచితంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు మాజీ ఎంపీపీ మల్లయ్య, మాజీ సర్పంచులు మల్లారెడ్డి, పర్మయ్య, చంద్రయ్య, కిష్టయ్య, శుభాష్ గౌడ్, లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, సురేందర్, ఎజాస్ పటేల్, శ్రీనివాస్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, చంద్రయ్య, వెంకటేశం, మల్లేశం, మల్లారెడ్డి, వేమారెడ్డి తదితరులు ఉన్నారు.